నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్ నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, మంగళవారం 26 మార్చి 2024 | MAHABUBNAGAR NARAYANPET




మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో హోలీ వేడుకల్లో భాగంగా సంబురాలు చేసుకుంటున్న ప్రజలు



గద్వాల జిల్లా కేంద్రంలో రంగులద్దుకుంటున్న యువతులు



వనపర్తిలో..





వనపర్తిలో..



నాగర్‌కర్నూల్‌లో..



రాజోళి మండల కేంద్రంలో ఉట్టి కొడుతున్న మహిళలు



కొల్లాపూర్‌లో గిరిజన మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న మంత్రి జూపల్లి

# సప్తవర్ణ శోభితం

- అంబరాన్నంటిన హోలీ వేడుకలు
- రంగుల సింగిడిగా ఉమ్మడి జిల్లా
- చిన్నాపెద్ద తేడా లేకుండా సంబురాలు
- వాడవాడలా యువత కేరింతలు
- డీజే డ్యాన్స్‌లతో దద్దరిల్లిన పల్లె, పట్నం

ఉమ్మడి జిల్లా సప్తవర్ణాలతో పులకించిపోయింది. పుడమి రంగుల సింగిడి పర్చుకున్నది. ప్రేమ, అప్యాయత, సౌభ్రాతృత్వానికి రంగుల పండుగ ప్రతీకగా నిలిచింది. అంతటి కలర్‌ఫుల్ రంగులకేళీ హోలీని సోమవారం ప్రజలు సంబురంగా జరుపుకొన్నారు. పల్లెలు, పట్నాల్లోని వీధులన్నీ రంగులమయమయ్యాయి. ఉదయం నుంచే చిన్నారులు రంగుల డబ్బాలతో దర్శనమిచ్చారు. యువత కేరింతలు కొడుతూ సందడి చేయగా.. చిన్నా, పెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకొని ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు డీజే పాటలు, బ్యాండ్‌మేళాల మోతలు హోరెత్తగా.. డ్యాన్స్‌ల జోరు కొనసాగింది. పలు చోట్ల యువకులు ఉట్లు కొట్టగా.. కొన్ని ప్రాంతాల్లో బైక్ ర్యాలీ జోరుగా కొనసాగింది. కొల్లాపూర్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పలు చోట్ల ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు.

- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, మార్చి 25



గద్వాల పట్టణంలో



వనపర్తి జిల్లా కేంద్రంలో చిన్నారుల కేరింతలు





అడ్డాకులలో చిన్నారుల సంబురం



మిడ్జిల్‌లో డీజే పాటలకు నృత్యాలు చేస్తున్న చిన్నారులు



నారాయణపేటలో..



మహబూబ్‌నగర్‌లో..





మహబూబ్‌నగర్‌లో చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న మహిళలు

## వేడుకల్లో అపశృతి

- వాటర్‌ట్యాంక్ కూలి చిన్నారి, ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

నారాయణపేట, మార్చి 25 : నారాయణపేట పట్టణంలో సోమవారం జరుపుకొన్న హోలీ సంబురాల్లో అపశృతి చోటు చేసుకున్నది. 20వ వార్డు పరిధిలోని గోపాల్‌పేట వీధిలో హోలీ సంబురాల్లో భాగంగా మంచినీటి ట్యాంకు వద్ద చిన్నారులు ఆడుకుంటుండగా అకస్మాత్తుగా కూలిపోయింది. దీంతో ఆ ట్యాంకు సిమెంట్ ముక్కలు అక్కడే ఆడుకుంటున్న చిన్నారులపై పడ్డాయి. స్థానికులు గమనించి గాయపడిన చిన్నారులు లక్ష్మీప్రణీత, హరిప్రియ, నిహారికను చికిత్స నిమిత్తం జనరల్ దవాఖానకు తరలించగా.. లక్ష్మీప్రణీత(12) మృతి చెందింది. గాయపడిన నిహారిక, హరిప్రియకు చికిత్స అందిస్తున్నారు. పండుగ వేళ ఇలాంటి సంఘటన జరుగడంతో బాధితుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అప్పటి వరకు తమ కళ్లెదుటే ఆడుకుంటున్న చిన్నారి మృతి చెందడంతో లక్ష్మీప్రణీత కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

***మామిడిమాడ గ్రామంలో..***

ఖిల్లాఘణపురం, మార్చి 25 : మండలంలోని మామిడిమాడలో సోమవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. హోలీ అనంతరం విద్యార్థులు, యువకులు కలిసి స్నానం చేసేందుకు బావికి వెళ్లారు. బావిలో ఈత పడుతున్న సమయంలో శ్రీకాంత్ (16) అనే విద్యార్థి మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు అతడిని బావిలో నుంచి బయటకు తీసి వెంటనే దవాఖానకు తరలించారు.

పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంకట్‌రెడ్డి, యాదమ్మ, కుటుంబ సభ్యులు దవాఖానకు చేరుకొని గుండెలు బాదుకొని రోదించారు. పండుగ పూట విద్యార్థి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.





నారాయణపేటలో కూలిన వాటర్ ట్యాంక్,లక్ష్మీప్రణీత(ఫైల్)





అలివేలు మంగమ్మ కల్యాణం సందర్భంగా తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు, పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

## కనుల పండువగా కల్యాణం

- వైభవంగా అలివేలు మంగమ్మ బ్రహ్మోత్సవాలు
- మన్యంకొండలో ఉత్సవ శోభ

పాలమూరు, మార్చి 25 : పేదల తిరుపతి అయిన మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి అనుసంధానమైన అలివేలు మంగతాయారు అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సోమవారం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. అదే విధంగా వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అమ్మవారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడంతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అలివేలు మంగమ్మకు గరుఢ వాహనసేవ, విమాన తేరు మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అలహరి మధుసూదన్‌కుమార్, ఈవో శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారితోపాటు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## మార్మోగిన గోవింద నామస్మరణ

బిజినేపల్లి, మార్చి 25 : మండలంలోని వట్టెం అడ్డగట్టుపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా గ్రామంలో స్వయంభూగా వెలిసిన నారదగిరి లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, భాస్కరాచారి, శ్రీనుతోపాటు భక్తులు ఉన్నారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

## రమణీయం.. రథోత్సవం



కందూరు రామలింగేశ్వరస్వామి రథాన్ని లాగేందుకు పోటీ పడుతున్న భక్తులు

- రథంపై ఊరేగిన ఆది దంపతులు
- తేరులాగేందుకు భక్తుల పోటీ
- పంచాక్షరీ మంత్రంతో మార్మోగిన కందూరు క్షేత్రం

మూసాపేట(అడ్డాకుల), మార్చి 25 : కందూరు రామలింగేశ్వరస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. రథంపై ఆది దంపతులను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. ఈ సందర్భంగా ఓం నమః శివాయ అంటూ పంచాక్షరీ మంత్రంతో కందూరు రామలింగేశ్వరస్వామి క్షేత్రం మార్మోగింది. ఆదివారం మధ్యరాత్రి కాముడి దహనం అనంతరం స్వామివారి రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా నిత్యోపాసన, రుద్రహోమం, బలిహరణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున సాత్విక బలిగా గుమ్మడి, కొబ్బరి కాయలను సమర్పించారు. గొలుసులు, తాళ్లను పట్టుకొని ఓం నమఃశివాయ అంటూ వేలాది మంది భక్తులు పోటీ పడి రథాన్ని ముందుకులాగారు. రథాన్ని ఆలయం నుంచి జాతర ప్రాంగణం వరకు లాగి తిరిగి యథాస్థానానికి తీసుకెళ్లారు. రథోత్సవంలో చిన్నా పెద్దా తేడా లేకుండా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం రథాంగ హోమం, బలిహరణతోపాటు ప్రత్యేక శాంతి పూజా కార్యక్రమాలు చేపట్టారు. రథోత్సవాన్ని తిలకించేందుకు తెలంగాణ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భూత్పూర్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రత్యేక పూజలు ముగిసిన అనంతరం భక్తులకు స్వామివారి నిజరూప దర్శనానికి అవకాశం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బందితోపాటు భక్తులు పాల్గొన్నారు.



### ఘనంగా తెప్పోత్సవం

రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం స్వామి వారిని భాజాభజంత్రీలు, తప్పెట్ల మోతల మధ్య ఘనంగా ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించి పల్లకీసేవ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైలం.. భక్తజన సంద్రం

శ్రీశైలం, మార్చి 25 : శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున మహా పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పరమ శివుడి దర్శనానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఉత్తర దక్షిణాది యాత్రికులు కూడా అధికసంఖ్యలో క్షేత్రానికి చేరుకున్నారు. సోమవారం తెల్లవారుజామున కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, సారెలతో దీపదానాలు చేశారు. అయితే స్వామిఅమ్మవార్ల దర్శనం కోసం కంపార్టుమెంట్లలో వేచిఉన్న యాత్రికులకు ఉచిత క్యూలైన్ ద్వారా నాలుగు గంటల సమయం పట్టగా శీఘ్ర, అతిశీఘ్ర ప్రత్యేక క్యూల ద్వారా రెండు గంటల సమయం పట్టింది. అదే విధంగా ఆర్జిత సేవాకర్తలకు నిర్ణీత సమయాల్లో అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించినట్లు ఏఈవో హరిదాసు తెలిపారు. సాయంత్రం కళారాధన వేదికపై హైదరాబాద్‌కు చెందిన అభినయ కూచిపూడి కళాక్షేత్రం బృందంవారిచే సంప్రదాయ గీతాలకు నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

## విరబూసిన సీతా అశోక పుష్పం

- జడ్చర్ల బీఆర్ఆర్ కళాశాలలో వికసించిన అరుదైన మొక్క
- 'సరాక అశోక' శాస్త్రీయ నామం
- 'అసోకారిస్టం' మందు తయారీ



తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో విరబూసిన పుష్పం

జడ్చర్లటౌన్, మార్చి 25 : జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో అరుదైన సీతాఅశోక మొక్కకు పుష్పం విరబూసింది. అంతరించిపోతున్న మొక్కలలో ఒకటైన సీతా అశోక మొక్కలు తెలంగాణ రాష్ట్రంలో కేవలం నల్లమల అడవుల్లోనే పెరుగుతాయి. ఈ మొక్కను ఆంధ్రప్రదేశ్‌లోని యోగివేమన యూనివర్సిటీలోని లీడ్ బొటానికల్ గార్డెన్ నుంచి సేకరించి జడ్చర్లలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో పెంచుతున్నారు. ఈ క్రమంలో సీతా అశోక మొక్క అందమైన ఆకృతిలో పుష్పించిందని గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ సదాశివయ్య తెలిపారు. ఈ మొక్కకు సరాక అశోక అనే శాస్త్రీయ నామం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ చెట్టులోని ప్రతిభాగం ఔషధమేనని, దీని నుంచి అసోకారిస్టం అనే మందును తయారు చేస్తారని చెప్పారు. మహిళలకు సంబంధించిన వ్యాధులు నయం చేయడానికి దీన్ని ఉపయోగిస్తారన్నారు. పురాణాల్లోనూ ఈ మొక్క ప్రాధాన్యతను తెలియజేశారని, బుద్ధుడు అశోక చెట్టు కింద జన్మించాడని, అశోకచెట్టు వనంలో సన్యాసం స్వీకరించాడని ప్రతీతి. ఈ చెట్టు ఎక్కడ ఉంటే అక్కడ శోకం ఉండదని చెబుతుంటారన్నారు. అంతరించిపోతున్న ఈ మొక్కలను కాపాడే క్రమంలో తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో దీన్ని పెంచుతున్నట్లు సదాశివయ్య తెలిపారు.